ప్రజాశక్తి

ఇళ్లస్థలాల కోసం భూమిలో జెండాలు పాతుతున్న నాయకులు, నిరుపేదలు

'ఆశా'లు అధికారుల దృష్టిలో ఆయాలు

సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, కార్మిక మహిళాసంఘం నాయకురాలు దిల్షాద్

డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల ఆందోళన

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న నాయకులు, ఆశాకార్యకర్తలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆశా కార్యకర్తలను మండల స్థాయి అధికారులు ఆయాలుగా చూస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, కార్మిక మహిళా సంఘ నాయకురాలు దిల్షాద్ విమర్శించారు. మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు ఆశా వర్కర్లు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి సిఐటియు నాయకులు వెంకటేష్, దిల్షాద్, జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు సౌభాగ్య, సిఐటియు గంగాద్రి, బ్యాల అంజి ,లక్ష్మీనారాయణ, పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఆశా వర్కర్లు జిల్లా కార్యాలయంలోకి ప్రవేశిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో కార్యాలయం ముందు రోడ్డుపై బైటాయించారు. రెండు గంటలపాటు రోడ్డుపైనే కూర్చుని ప్రభుత్వానికి పోలీసులకు, వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఇఎస్ వెంకటేష్, కార్మిక మహిళా సంఘ నాయకురాలు దిల్షాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు పరచలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆశాలు తమ సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమానికి బయలుదేరితే వారిని అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. గతంలో కార్యాలయం ముందు జరిగిన ధర్నా లో ఇదే అధికారి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దీంతో తిరిగి ధర్నాకు పిలుపునిచ్చామని చెప్పారు. గతంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి నెలనెలా సమావేశంలో నిర్వహించి సమస్యలను పరిష్కారం చూపుతామని చెప్పిన జిల్లా అధికారులు ఎలాంటి సమస్యలను పరిష్కరించకపోగా, ఆశా వర్కర్లపై వేధింపులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో 2జి వాడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ యాపులతో పని చేయలేకపోతున్నారని, దాని నుండి విముక్తి కల్పించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రామ సచివాలయాల్లో చెత్తను తొలగించడం నీరు తేవడం, బ్యాగులు మోయడం లాంటి పనులు ఆశాలతో చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా వద్దకు చేరుకున్న డిఎంహెచ్ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్ల డిమాండ్లను ఇదివరకే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని త్వరలో నిర్ణయం వస్తుందని చెప్పారు. తన పరిధిలో లేని విషయాలను తాను తీర్చలేనని తన పరిధిలో ఉన్న వాటిని తక్షణం అమలు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయం ముట్టడికి యత్నించిన ఆశా వర్కర్లను పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవ్ ఆధ్వర్యంలో నల్లమాడ సిఐ యాదవ్, పుట్టపర్తి రూరల్ సిఐ ఆధ్వర్యంలో సిబ్బంది అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూల నుండి వచ్చిన ఆశావర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు మంగళవారం తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి తరలి వెళుతున్న ఆశ వర్కర్లను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో గత వారంలో సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తల కలెక్టరేట్ ముట్టడి విజయవంతమైన నేపథ్యంలో ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల కోసం మంగళవారం తలపెట్టిన ధర్నాకు జిల్లా నలుమూలల నుండి పుట్టపర్తి చేరుకోవడానికి వస్తున్న ఆశావర్కర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ఎక్కడివారిని అక్కడే అడ్డుకొని అరెస్టులు చేశారు. జగరాజు పల్లి, మామిళ్లకుంట, కర్నాటక నాగేపల్లి కూడళ్లలో వాహనాలను తనిఖీ చేసి ఆటోలలో, బస్సులలో వస్తున్న ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమందేపల్లి, అమరాపురం, మడకశిర, పెనుగొండ, తదితర మండలాల నుండి వస్తున్న ఆశా వర్కర్లను జగరాజుపల్లి క్రాస్ వద్ద పుట్టపర్తి రూరల్ ఎస్ఐ దాదా పీర్ తన సిబ్బందితో అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆగ్రహించిన ఆశాలు ధర్మవరం పుట్టపర్తి ప్రధాన రహదారిపై బైటాయించి ప్రభుత్వానికి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదేవిధంగా కర్నాటక నాగేపల్లి వద్ద, నల్లమాడ ,బుక్కపట్నం వైపు నుండి వచ్చు వాహనాలను బస్సులను తనిఖీ చేసి ఆశాలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మరి కొంతమంది మహిళా పోలీసులు ఆటోలను బస్సులను నిలిపి ఆధార్ కార్డులను ఐడెంటి కార్డులను పరిశీలించి ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. కొంతమంది పోలీసులను తప్పించుకుని ధర్నా ప్రాంగణానికి చేరుకున్నారు. అరెస్టు అయిన వారిని వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకుల డిమాండ్ మేరకు కొంతసేపటి తర్వాత విడుదల చేశారు.

రోడ్డుపై బైటాయించిన ఆశాకార్యకర్తలు

తనకల్లులో భూపోరాటం

సిపిఎం ఆధ్వర్యంలో జెండాలు పాతిన పేదలు

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రం పరిధిలోని సర్వే నెంబర్ 794 లో గల ప్రభుత్వ భూమిలో ఇళ్లు లేని నిరుపేదలు సిపిఎం రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పాతి గుడిసెలు ఏర్పాటు చేసుకోవడానికి సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదల కోసం ఇదే భూమిలో ఇళ్ల పట్టాల మంజూరు చేయాలని రెండు సంవత్సరాలుగా రెవిన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ బడా బాబులకు ఎకరాలకు ఎకరాలు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి పట్టాలు లేని నిరుపేదలను గుర్తించి వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుడిసెలు వేసుకొని అక్కడే నివాసం ఉండేలా ఏర్పాటు చేసుకుంటామని హెచ్చరించారు. ఇళ్లపట్టాలు అందించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివన్న, వివి రమణ, కొట్టు వెంకటరమణ, సిఐటియు నాయకులు ఒంటెద్దు వేమన్న, నిరుపేదలు పాల్గొన్నారు.

వృథాగా వాణిజ్య సముదాయ భవనాలు

పురపాలికకు నెలకు రూ.18లక్షలు నష్టం

ఉపయోగంలో లేని వాణిజ్యసముదాయం

ప్రజాశక్తి- హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా దాదాపు 9 ఎకరాల్లో హిందూపురం పట్టణ నడిబొడ్డున పురపాలక సంఘం దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి నూతన వాణిజ్య సముదాయం, కూరగాయాల మార్కెట్‌ను నిర్మించింది. వీటి నిర్వహణకు సంబంధించి వేలం పాటలు నిర్వహించి ఏడాది గడిచింది. అయినప్పటికి వేలం పాటలో గదులు తీసుకున్న వ్యాపారులు వాణిజ్య సముదాయ భవనంలోకి అడుగు పెట్టడం లేదు. దీనికి ప్రధాన కారణం అక్కడ మున్సిపల్ అధికారులు వేలంపాట సమయంలో వ్యాపారులకు చెప్పిన విధంగా సౌకర్యాలు కల్పించక పోవడమేనని తెలుస్తోంది. దీంతో ప్రతి నెల సుమారు రూ.18లక్షలు పురపాలక సంఘానికి నష్టం వస్తోంది.

హిందూపురం పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న కూరగాయాల మార్కెట్‌ను అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో పడగొట్టారు. శిథిలావస్థలో ఉన్న ఈ సముదాన్ని పడగొట్టి అదే స్థానంలో నూతనంగా అన్ని సౌకర్యాలతో సుమారు రూ.100 కోట్లతో కూరగాయాల మార్కెట్‌తో పాటు వాణిజ్య సముదాయం, చికెన్, మటన్, చేపలు, పూలు, పండ్లు ఇలా ప్రతి ఒక్కటి అక్కడే ప్రజలకు అందే విధంగా నిర్మాణం చేస్తామని ఆ సమయంలో చెప్పారు. దీంతో పాటు అప్పటికే అక్కడ వ్యాపారాలు చేస్తున్న వారికి ప్రాధాన్యత ఇచ్చి వారికి ఎటువంటి గుడ్‌విల్ లేకుండా గదులు కేటాస్తామని హామీ ఇచ్చారు. అయితే రూ.100 కోట్లు కాదు కదా కనీసం రూ.50కోట్లతో కూడా మార్కెట్ నిర్మాణం చేపట్ట లేకపోయారు. చివరకు ఎన్నికలు సమీపించడంతో ప్రభుత్వం రూ.10 కోట్లు, పురపాలక సంఘం రూ.3కోట్లు, గుడ్‌విల్ రూపంలో రూ.10కోట్లు మొత్తం రూ.23కోట్లతో మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించింది. నిర్మాణం పూర్తిస్థాయిలో కాకమునుపే ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా దానిని ప్రారంభించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. దీంతో మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలకృష్ణ, ఇటు ప్రస్తుత ప్రభుత్వం మార్కెట్ గూరించి పూర్తిగ విస్మరించారు. ఇక్కడికి వచ్చిన మున్సిపల్ కమిషనర్లు సైతం మార్కెట్ గురించి ఆలోచన చేయలేదు. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాలు క్రితం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాలక వర్గ సహకారంతో మార్కెట్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి, మార్కెట్ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో పాటు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈనేపథ్యంలో కూరగాయాల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి దానిని సైతం ప్రారంభించారు. అయితే వాణిజ్య సముదాయంలో అవసరమైన సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించ లేదని ఆరోపిస్తు వ్యాపారులు వాణిజ్య సముదాయంలో తమ వ్యాపారాలను ఇంత వరకు ప్రారంభించలేదు.

నిబంధనలు మరచిన అధికారులు

నూతన మార్కెట్, వాణిజ్య సముదాయం ప్రారంభ సమయంలో మున్సిపల్ అధికారులు వ్యాపారులకు పలు హామీలు ఇచ్చారు. మార్కెట్ చుట్టు రెండు కిలోమీటర్ల వరకు ఎలాంటి తోపుడు బండ్ల వ్యాపారాలు లేని విధంగా చూస్తామని చెప్పారు. అయితే ఈ నిబంధనలు అమలు చేయడంలో అధికారులు పూర్తిగ విఫలం అయ్యారు. మార్కెట్ ముందు తోపుడు బండ్ల వ్యాపారులు వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ లోపలికి ఎవరు రావడం లేదని, ఇప్పటికే వడ్డీలకు తీసుకోచ్చి పురపాలక సంఘానికి చెల్లించాల్సిన గుడ్‌విల్ చెల్లించామని, ఇక పెట్టుబడి పెట్టి వ్యాపారాలు ప్రారంభిస్తే వ్యాపారాలు జరగక తెచ్చిన డబ్బులకు వడ్డీలు సైతం చెల్లించడం కష్టంగా మారుతుందని వ్యాపారాలు ముందుకు రాలేదు.

సౌకర్యాలు కల్పిస్తే నెలకు రూ.18లక్షలు ఆదాయం

పురపాలక సంఘం అధికారులు, పాలక వర్గం నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయంలో, మార్కెట్‌లో వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే పురపాలక సంఘానికి నెలకు సుమారు రూ.18లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో పాటు మార్కెట్ కింద పూల వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, మార్కెట్ ముందు ఉన్నా పురపాలక స్థలంలో కూరగాయాల హోల్‌సేల్ వ్యాపారులకు కేటాయించి, వారికి గదులు నిర్మాణం చేసి ఇస్తే మరో రూ.2లక్షలు ఆదాయం వస్తుంది. అందుకు అనుగుణంగా పాలక వర్గం, అధికారులు అడుగులు వేస్తే పురపాలక సంఘానికి ఆదాయం పెరుగుతుంది.

'జగనన్న తోడు' తో చిరువ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని చిరువ్యాపారులకు జగనన్న తోడు పథకం చేయూతను అందిస్తోందని ఈ పథకం కింద జిల్లాలో 19,546 మంది 21.05 కోట్ల రూపాయలు లబ్ధి పొందుతున్నారని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి ఈ పథకం ప్రారంభించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, అగ్రి బోర్డు జిల్లా చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా చైర్ పర్సన్ లక్ష్మీ నరసమ్మ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జగనన్న తోడు పథకం క్రింద 7వ సారి చిరు వ్యాపారులు, సాంప్రదాయ వృత్తిదారులకు ఒక్కొక్కసారి 10వేల రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ అవుతుందన్నారు. రుణాలు పొంది సకాలంలో చెల్లించిన19,487 మందికి 43.20 లక్షలు వడ్డీ రియంబర్స్ మెంట్ కింద జమవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో 5,997 మందికి రూ. 6.45 కోట్ల రూపాయలు, గ్రామీణ ప్రాంతాల్లో 13,549 మంది లబ్ధిదారులకు రూ. 14.59 కోట్ల రూపాయలు లబ్ధి చేకూరుతోందని వివరించారు. వడ్డీ రియంబర్స్ మెంట్ పట్టణ ప్రాంతాల్లో 6,687 మందికి రూ. 14.82 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 12,800 మందికి రూ. 28.38 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. చిరువ్యాపారులకు చేయూత ఇచ్చే విధంగా పూర్తి భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దేశంలోనే వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా చిరు వ్యాపారుల ఆదాయాలను మెరుగుపరుచుకునేందుకు సున్నా వడ్డీ రుణాలు దోహదపడుతున్నాయన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. రుణాలు పొందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ స్థానిక ప్రజా ప్రతినిధులు కలసి మెగా చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిక కార్పొరేషన్ చైర్మన్ నళిని, ఎల్‌డిఎం రమణకుమార్, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

స్పందనన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

జిల్లా ప్రత్యేక అధికారి కెవిఎన్ చక్రధర్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా ప్రత్యేక అధికారి, జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్. చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్ బాబు తో కలిసి జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒకొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చక్రధర్ బాబు మాట్లాడుతూ, జిల్లా కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తున్నారని, రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా నిలిచిందని అందుకు అధికారులను అభినందిస్తున్నామని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు ఎలా అమలు అవుతున్నాయో ఫీడ్ బ్యాక్ చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వాలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు జగనన్న సురక్ష సర్వేలో పూర్తిగా పాల్గొనే విధంగా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు ఇప్పుడున్న సీజన్ అనుగుణంగా ప్రజలకు సేవలు అందించి అర్హత కలిగి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏదో ఒక సమస్య వస్తూనే ఉంటుందని ఆయా శాఖల అధికారులు సమస్యలు పరిష్కరించుటకు గ్రామసభలలో వచ్చిన సమాచారాన్ని తీసుకొని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారిగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకొనుటకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కొత్తగా ఏర్పడిన సత్యసాయి జిల్లాలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. జిల్లాకు సంబంధించి 2578 గ్రీవెన్స్‌లు రాగా 2280 పరిష్కారం అయినయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ సమస్యలు 88 శాతం పరిష్కరించామన్నారు. సచివాలయాల పనితీరును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ద్వామా పీడీ రామాంజనేయులు, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, డిఎస్ఒ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి

ఆ ఇద్దరు పిసిసిలు ఎటువైపు..?





రఘువీరా రెడ్డి మౌనం
టిడిపి వైపు శైలూ చూపు ..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. ఈ సమయంలో నేతలు ఎవరు ఎటు ఉంటారోనన్న చర్చలు సర్వత్రా సాగుతూనే ఉంటాయి. ఇదే కోవలో ఇద్దరు మాజీ పిసిసి అధ్యక్షుల పట్ల కూడా జిల్లాలో చర్చ సాగుతుండటం గమనార్హం. జిల్లాలో సీనియర్ నాయకుల్లో మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డిరు ఒకరు. ముందు నుంచి కాంగ్రెసు పార్టీలో ఉంటూ అనేక పదవులను అలంకరించి జిల్లాపై ఒక చెరగని ముద్రను వేశారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రిగానూ పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెసు పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా దెబ్బతింది. ఈ తరుణంలో ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను తీసుకుని పూర్వ వైభవాన్ని ఇక్కడికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు. 2014, 2019 ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో పెనుకొండ, కళ్యాణదుర్గంలోనూ ఆయన పోటీ చేసినప్పటికీ కాంగ్రెసుపై ఉన్న వ్యతిరేకతతో ఓటమిని చవిచూడక తప్పలేదు. 2019 ఎన్నికల తరువాత నుంచి పిసిసి పదవి నుంచి కూడా తప్పుకుని రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెసు పార్టీ తరపున అక్కడ ప్రచారం చేశారు. తిరిగి ఆయన యాక్టివ్ అయ్యారని భావించారు. కాని ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాల పట్ల మాత్రం మౌనంగానే ఉంటూ వస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోపు అయినా ఇక్కడి రాజకీయాల వైపు దృష్టి సారిస్తారా లేక దూరంగానే ఉంటారా అన్న చర్చ ఉమ్మడి జిల్లా వాసుల్లో చర్చ నడుస్తూ ఉంది. ఇక రఘువీరారెడ్డి పిసిసి అధ్యక్షతల నుంచి తప్పుకున్న తరువాత మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఆయన 2004లో వైద్యవృత్తిని వదిలి రాజకీయరంగ ప్రవేశం చేశారు. 2012లో కాంగ్రెసు పార్టీ హయంలోనే విద్యా శాఖ మంత్రి అయ్యారు. రఘువీరారెడ్డి పిసిసి అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నాక ఆయన పిసిసి అధ్యక్షులయ్యారు. మొన్నటి వరకు ఆయన పిసిసి అధ్యక్షులుగా ఉంటూ వచ్చారు. కాని ఇటీవల ఆయన స్థానంలో గిడుగు రుద్రరాజును నియమించారు. అప్పటి నుంచి ఆయన కొంత వరకు కాంగ్రెసుకు దూరంగా జరుగుతున్నారన్న ప్రచారం రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇక రాష్ట్రంలో కాంగ్రెసు ఇప్పట్లో పుంజుకునే పరిస్థితి లేదన్న ఉద్దేశ్యంతో ఇతర పార్టీల వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన పూర్వపు నియోజకవర్గమైన శింగనమలలో ఇటీవలి కాలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ముందున్న పరిచయాలతో ముఖ్యమైన వారిని గ్రామాల వారీగా కలుస్తూ, వచ్చే ఎన్నికల్లో తనకు సహకారం అందివ్వాలని కోరుతున్నారు. అయితే ఏ పార్టీ తరపున అన్నది స్పష్టంగా వారికి మాత్రం చెప్పడం లేదు. అయితే ఆయన తెలుగుదేశం పార్టీలోకి త్వరలో చేరే అవకాశముందన్నది మాత్రం ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల కాలంలో ఆయన ఆ పార్టీ ముఖ్య నేతలతో మంతనాలు జరిపారన్న ప్రచారమూ ఉంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో ఆ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని చెక్ పెట్టేందుకు ఆయన్ను తీసుకొస్తే బాగుంటుందన్న ఆలోచనలోనూ తెలుగుదేశం పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ శైలజనాథ్ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. అయితే రఘువీరారెడ్డి ఎటు అన్నదే ఇప్పటికీ స్పష్టత లేదన్నది రాజకీయవర్గాల్లో సాగుతున్న చర్చ.

వంకలో ఇంటి నిర్మాణాలను ఆపండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక నక్కలగుట్ట కాలనీలోని వంకను ఆక్రమించి కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, వాటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగే చెరువు కింద 120 ఎకరాల ఆయకట్టు భూమి, నక్కలగుట్టలోని వంక ద్వారా చెరువులోకి పెద్ద మొత్తంలో నీరు చేరుతాయన్నారు. అయితే వంకను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంపై విచారణ చేసి, ఈ నిర్మాణాలను ఆపి చెరువును కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌కు డాక్టరేట్

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాల్లో డాక్టరేట్ అందుకున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సోమవారం అనంతపురం నగర శివారులోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవాల్లో భాగంగా సామాజిక శాస్త్ర విభాగంలో గవర్నర్, వైస్ ఛాన్సలర్ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. దీంతో ఆయనను కళాశాల ఎఒ కేశవయ్య, వైస్ ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపక బందం అభినందనలు తెలిపారు.

సిఎ ఫలితాల్లో మనోహర్ అత్యుత్తమ ప్రతిభ

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల విద్యార్థి మనోహర్ 2022-23 సిఎ సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 549/600 మార్కులతో మొదటి స్థానం సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతటి అద్భుత విజయాన్ని సాధించిన మనోహర్‌కు ప్రిన్సిపల్‌తో పాటు ఎఒ కేశవయ్య, వైస్ ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకులు వినోద్, సంధ్య అభినందనలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ. 50వేల విరాళం

నల్లచెరువు : మండల పరిధిలోని గొర్లవాండ్లపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నూతన రామాలయానికి కదిరి ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి రూ. 50 వేల విరాళాన్ని ఎంపిపి రమణారెడ్డి ద్వారా అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణ పాఠశాల సీజ్

కొత్తచెరువు : స్థానిక నారాయణ పాఠశాలలో అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తుం డడంతో డీఈవో మీనాక్షి ఆదేశాల మేరకు మంగళవారం తనిఖీలు చేసి ఆయా గదులను సీజ్ చేసినట్లు పెనుకొండ డిప్యూటీ డిఇఒ రంగస్వామి, ఎంఈఓ జయచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకూ అనుమతులు ఉన్నాయని, మిగిలిన తరగతులకు అనుమతి ఇవ్వలేదన్నారు. కావున తల్లిదండ్రులు పిల్లలను గుర్తింపు లేని పాఠశాలలో చేర్పించవద్దని సూచించారు.

In the Court of the Junior Civil judge: Puttaparthy
O.S.No:39/2022
Between:
Sankara Sreenivasulu ...Plaintiff
And
Neeruganti Ramalakshmamma & others. ...Defendants
పై నెంబరు దావాలోని 3వ ప్రతివాదికి దావా సమన్లు
To,
D3:Neeruganti Dhanalakshmi D/o N.Kondappa, Business, Near Obi Reddy Swamy Gudi, Sundaramaiah Colony Road, Bukkapatnam.
ఇందుమూలకముగా నీకు తెలియచేయడమేమనగా పై నెంబర్ దావాలోని దావా మొత్తము మీ నుండి రాబట్టుకొనుటకు గాను వాది మీ మీదపై దావాను దాఖలు చేసినారు. సదరి విషయమునీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల నీవు 26-07-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు పై దావాను తీర్మానము చేయుదురని యిందుమూలకముగా మీకు తెలియచేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఎం.రాజేంద్రప్రసాద్‌రెడ్డి,
వాదిపరం వకీలు, పుట్టపర్తి శ్రీసత్యసాయి జిల్లా.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE: HINDUPURAM
O.S.No.196/2018
Between:
Bakthar Sab and 5 others ...Plaintiffs
And
Bakthar Sab and 9 others ...Defendants
NOTICE TO THE DEFENDANTS No.3,6 and 7
D3:Mydeen bee W/o Buden Sab, Aged 33 years, House wife, Kothapalli Village and Post, Kodipalli Panchayath, Lepakshi Mandal, Hindupuram Taluk, Sri Sathya Sai Dist.
D6:Rasool bee W/o Hussain Sab, Aged 40 years, House wife, Kothapalli Village and Post, Roddam Mandal, Penukonda Taluk, Sri Sathya Sai Dist.
D7:Ramija W/o Babu, Aged 35 years, House wife, Roddam Village and Mandal, Penukonda Taluk, Sri Sathya Sai Dist. ...Defendants No.3,6 and 7
The Plaintiffs filed the above suit for partition and separate possession on the file of the Hon'ble Additional Junior Civil Judge Court, Hindupur against you and others. The above O.S.196/2018 posted to 10-08-2023 for your appearance. If you failed to appear before the above court on 10-08-2023 in person or through an advocate you will be set ex-parte and the matter will be decided in your absence.
(By Order of the Court)
C.NAGARAJU
Advocate for the Plaintiffs
Hindupuram, Sri Sathya Sai District.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

సచివాలయాలకు వచ్చే ప్రజలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మండల పరిధిలోని మందలపల్లి గ్రామ సచివాలయ, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని, గుమ్మయ్యగారిపల్లి జగనన్న లేఅవుట్‌ను మంగళవారం వారు పరిశీలించారు. ముందుగా మందలపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్‌బికెను పరిశీలించి స్టాక్, రికార్డులను పరిశీలించారు. అలాగ గ్రామ సచివాలయంలో సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. సమస్యలపై వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే నివృత్తి చేయాలన్నారు. అనంతరం మల్లాపల్లి లేఔట్‌ను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. వారి వెంట హౌసింగ్ పీడీ చంద్రమౌళేశ్వర్‌రెడ్డి జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథగుప్తా, మందలపల్లి సర్పంచి ప్రమీలమ్మ ముసిలిరెడ్డి, మల్లాపల్లి సర్పంచి శివానంద, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే

చిలమత్తూరు :స్థానిక సచివాలయం-2 పరిధిలో రీ సర్వే పనులను మంగళవారం రీ సర్వే ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ఎన్ని రెవెన్యూ పొలాల్లో రీ సర్వే జరుగుతుందని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రోజుకు ఆ రోజు ఎల్‌పిఎం చేకోవాలని సూచించారు. రీ సర్వే ఏ పొలంలో నిర్వహిస్తామో ఆ పొలాలకి సంబంధించిన రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి అగ్రిమెంట్‌ల మీద అమ్మకాలు జరిగినవి ఉన్నాయా? వాటిని ఏవిధంగా పరిష్కరిస్తున్నారన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయా? అవి సచివాలయాల్లోనే జరుగుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఖచ్చితమైన పొలం గట్లను గుర్తించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాల న్నారు. ఆయన వెంట జెసి చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, తహశీల్దార్ నాగరాజు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ యూనస్, శాంతరాజ్, చిట్టిబాబు, సర్వేయర్ సురేష్, నరేష్, వీఆర్వో ప్రవీణ్, జ్యోతి తదితరులు ఉన్నారు.

రీ సర్వేని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి చక్రధర్

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని దొరిగిల్లు విద్యుత్ ఫీడర్ రైతులు మంగళవారం ముదిగుబ్బ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతేడాది అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయామని, ఈ ఏడాదైనా గట్టెకుతామనే ఆశతో అప్పులు చేసి వేరుశెనగ, టమాటో ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశామన్నారు. అయితే లో వోల్టేజీ, విద్యుత్ కోతలు, మరమ్మతులు, సాంకేతిక లోపాలు, తదితర సమస్యలు సాకుగా చూపి మూడు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేశారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై విద్యుత్ కదిరి ఈస్ట్ డిఈఈ ఆనంద్‌ను వివరణ కోరగా ఓవర్ లోడ్ సమస్యలు తలెత్తుతున్నాయని, లోడ్ డైవర్ట్ పద్ధతి ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తాం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలో భూమి లేని రైతులు కౌలు రైతు గుర్తింపుకార్డు పొందేందుకు అర్హులని వ్యవసాయ అధికారి భారతి తెలిపారు. స్థానిక ఎఒ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ భూ యజమాని నుంచి అంగీకార పత్రం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, రైతులకు రైతు భరోసా కూడా అందుతుందన్నారు. గుర్తింపు కార్డు గడువు 11 నెలలు అని, తిరిగి దానిని రెన్యువల్ చేసుకోవడానికి భూ యజమాని అంగీకారం అవసరమని తెలిపారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు ఉపయోగించుకోవాలని సంబంధిత విఆర్‌ఒ, వ్యవసాయ సహాయకులను సంప్రదించి గుర్తింపు కార్డు పొందవచ్చని ఆమె తెలిపారు.

నేరాలు ఘోరాలు

పెట్రోల్ పోసి నిప్పంటించిన స్నేహితుడు.. బాలుడు మృతి

అమరాపురం : చిన్న విషయానికి స్నేహితుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన సోమవారం అమరాపురం మండలంలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని శివరం గ్రామానికి చెందిన దళిత రంగనాథ్(17), దళిత మహంతేష్ స్నేహితులు. మహం తేష్ గ్రామంలోని ఓ దుకాణం వద్ద సిగరెట్ కాలుస్తుండగా రంగనాథ్ మీ అమ్మ నాన్నలకు చెబుతాను అని హెచ్చరించాడు. దీంతో కోపోద్రిక్తుడైన మహంతేష్ ఆ దుకాణం ముందు విక్రయానికి ఉంచిన పెట్రోల్ తీసుకొని రంగనాథ్‌పై చల్లి నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మడకశిర సిఐ సుధాకర్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం మడకశిర ఆసుపత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తనకల్లు : స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మద్దిగొల్ల చిన్ననరసింహులు (57) మంగళవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాంభూపాల్ యాదవ్ తెలిపారు. వివరాలు.. ఈయన ఆరేళ్ల క్రితం ఓ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఆ కేసు ప్రస్తుతం అనంతపురం కోర్టులో విచారణ జరుగుతుండగా శిక్ష పడుతుందేమో అనే భయంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతడికి భార్య ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కూలీ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గీతానగర్‌కు చెందిన కూలీ పోతలయ్య మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గీతానగర్‌కు చెందిన పోతలయ్య కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం పోతలయ్య భార్య దుర్గ వాదులాడుకున్నారు. దీంతో మనస్థాపా నికి గురైన పోతలయ్య ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోతలయ్యను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతులపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

బత్తలపల్లి : మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామంలో ఇంటి రస్తా విషయంలో దంపతులపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ పోట్లమర్రి గ్రామంలో రెండు నెలలుగా రస్తా విషయంలో బొమ్మకం ఓబిలేసు, ఆది నారాయణరెడ్డి కుటుంబాల మధ్య ఘర్షణ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి రస్తా విషయంలో సర్వే చేస్తుండగా ఓబిలేసు అడ్డుకున్నారన్నారు. దీంతో ఆదినారాయణరెడ్డి కుమారుడు, కోడలు అడ్డు రాగా వారిపై ఓబిలేసు దాడి చేశాడన్నారు. ఈ కేసులో నిందితుడిని గోట్లూరు వద్ద అరెస్టు చేసి ధర్మవరం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

బత్తలపల్లి : వరి పొలంలో పాకమాను తోలుతుండగా విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతిచెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన సమాచారం మేంకు.. పోట్లమర్రి గ్రామానికి చెందిన గంగులమ్మ పొలంలో పనులు చేసేందుకు అదే గ్రామానికి చెందిన దేవరకొండ రామాంజనేయులు తన ఎద్దుల ను తీసుకెళ్లాడు. పొలంలో పాకమాను తోలుతుండగా ఉన్నఫలంగా ఒక ఎద్దు పడిపోయింది. దీంతో అప్రమత్తమైన ఆయన రెండవ ఎద్దును తప్పించి తాను బయట పడ్డాడు. ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తెలిపారు. రూ. 1.30 లక్షలు వెచ్చించి ఎద్దులు కొన్నానని ఆదుకోవాలని బాధిత రైతు వేడుకొన్నాడు. విషయం తెలిసిన వెంటనే బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఎడి శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ట్రాన్స్‌కో ఎఇ శివయ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాద వివరాలపై ఆరా తీశారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి-హిందూపురం

ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయడం దుర్మార్గం అని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మండిపడ్డారు. ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టులను ఖండిస్తూ మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు ధర్నాకు పిలుపునిచ్చామని, ఈ ధర్నాకు ఆశా వర్కర్లు వెళ్లకుండా ఎక్కడికక్కడ ఆపడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించకపోతే ముందస్తు, అక్రమ అరెస్టులకు భయపడకుండా సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, నాయకులు అత్తర్ బాబా, చంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఆశా కార్యకర్తల సమస్యలపై డిఎంహెచ్ఒ కార్యాలయం ముందర ఆందోళన చేపడితే దానిని భగ్నం చేసేందుకు సిఐటియు నాయకులు, సిపిఎం నాయకులు, ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం తగదని సిఐటియు నాయకులు వెంకటేష్, ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. పోలీసులు జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధించి అరెస్టులు చేసి బస్సుల్లో నుంచి దించి స్టేషన్లకు తరలించారని ధ్వజమెత్తారు. ఇలాంటి అక్రమ అరెస్టులను సిఐటియు మండల కమిటీ ఖండిస్తుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆశా కార్యకర్తలపై పని భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, సిఐటియు మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. ఆశా కార్యకర్తల సమస్యలపై మంగళవారం పుట్టపర్తిలోని డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో వారు స్టేషన్ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయన్నారు. ఆశా కార్యకర్తల వేతనాల పెంపు, యూనిఫామ్ దుస్తులు, 4జి మొబైల్ ఫోన్లు అందచేయాలని, తదితర సమస్యలపై చేపట్టిన ధర్నాకు వెళుంటే అడ్డుకొని అరెస్టు చేయడం తగదన్నారు. ఇందుకు వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు ట్రేడ్ యూనియన్ నాయకులు, ఆశా వర్కర్ల సంఘం నాయకురాలు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : డిమాండ్ల సాధనకై పుట్టపర్తిలో డిఎంహెచ్ఓ కార్యాలయం ముట్టడికి వెళ్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్య అని సిపిఎం మండల కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పోలీసులు ఆశా వర్కర్లను అక్రమంగా ఇళ్ల వద్ద, ప్రయాణ మార్గాల వద్ద అడ్డుకొని స్టేషన్ తరలించడం అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేస్తున్న ఆశా వర్కర్లను అడ్డుకోవడం వల్ల నిరసన కార్యక్రమాలను సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హనుమయ్య, వెంకటేశులు, శ్రీకాంత్, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, బెస్త కృష్ణప్ప, ఉప్పర కృష్ణప్ప, నాగభూషణ పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతన్న సవితమ్మ, టిడిపి నాయకులు

మాజీ ఎమ్మెల్యే అనితపై అసత్య ప్రచారం నీచం

ప్రజాశక్తి -పెనుకొండ

తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితపై అసత్య ప్రచారం నీచమని, సిఎం జగన్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొ న్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తప్పులను ఎప్పటి కప్పుడు ఎండగడుగున్న అనితపై అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం దుర్మార్గమన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న వైసిపి పేటిఎం బ్యాచ్‌కి మహిళల చేతుల్లో బడిత పూజ తప్పదన్నారు. వైసిపి నేతల పోస్టులపై పోలీసులు స్పందించరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రంగప్ప, ప్రసాద్, నరసింహులు, త్రివేంద్రనాయుడు, బాలాజీనాయక్, మద్దిలేటి, రమేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : టిడిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితపై తప్పుడు రాతలు రాసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశగాళ్ల శ్రీనివాసులు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాహెబీ డిమాండ్ చేశారు. వంగలపూడి అనితపై ఓ దిన పత్రికలో వచ్చిన వార్తలపై మంగళవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగలపూడి అనితపై అసత్యప్రచారాలు చేస్తూ రాతలు రాయడం హేయమైన చర్య అన్నా రు. తప్పుడు రాతలు రాసిన విలేకరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ శ్రీనివా సులుకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవహక్కుల కమిషన్‌లకు పిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు స్వర్ణ, చౌడమ్మ, మమత, మున్ని, హయ్యత్, రత్నమ్మ, శారద, ప్యారీ వహిద, మీన, నాయకులు మొండి శీన, సుబ్బు, ఆదెప్ప, బద్రి, ముత్యాలు పాల్గొన్నారు.

వైసిపితో రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లింది

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమ య్య, సీనియర్ నాయకులు ఫణికుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 31వ వార్డులో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా మహాశక్తి పథకాలను మహిళలకు వివరించారు. ప్రజలు వైసిపి పాలన పట్ల విసుగుచెందారన్నారు. చంద్రబాబును సిఎంగా, పరిటాల శ్రీరామును ఎమ్మెల్యేగా చేసుకుంటే అటు రాష్ట్రం, ఇటు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్లను పునరుద్ధరణ చేసి ఆయా వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తలారి చంద్రమోహన్‌బాబు, కొత్తపేట ఆది, పురుషోత్తం గౌడ్, గోసల శ్రీరాములు, కేతినేని రాజ, బీరే శ్రీనివాసులు, సంగాల బాలు, చిన్నూరు లోకేశ్, తొగట అనిల్ పాల్గొన్నారు.

లోకేశ్‌ను మాట్లాడే అర్హత పోతుల సునీతకు లేదు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ గురించి మాట్లాడే అర్హత పోతుల సునీతకు లేదని తెలుగు యువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్ మండిపడ్డారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి హయాంలో పద్మశాలీయులు ఎమ్మెల్సీ, మేయర్, రాష్ట్ర, జిల్లాల పదవులు పొందిన విషయాన్ని గుర్తుచేశారు. పోతుల సునీతకు ఎమ్మెల్సీ ఇచ్చి రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.

విద్యార్థులు లక్ష్యం పెట్టుకోవాలి

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకుని ముందడుగు వేస్తే తప్పనిసరిగా విజయం చేకూరుతుందని కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డే సంబరాలను విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరస్పాండెంట్ డోలా పెద్దిరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ౦౦౦౦పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే మండల పరిధిలోని పాల సముద్రం గ్రామంలో సర్పంచి గంగులప్ప, ఎంపిపి ప్రమీలమూర్తి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల పంపిణీ తీరు గురించి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకి గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ నవరత్నాలులో భాగంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ముఖ్యంగా రైతులకు అండగా నిలిచారన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొస్తే అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి పాలే జయరాంనాయక్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ నూర్‌మహమ్మద్, ఆగ్రోస్ ఛైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్‌సాబ్, సుబ్బారెడ్డి, నర్సింపల్లి శివారెడ్డి, పాటూరి లక్ష్మిరెడ్డి, సచివాలయ కన్వీనర్ సమరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని శివాలయం వీధి, 19వ వార్డు పరిధిలోని చౌక్, బెస్త వీధి, జౌక్ పాల్యం స్ట్రీట్, పూలబజార్, అక్కామసీద్ వీధిలో మంగళవారం ఎమ్మెల్యే సిద్ధారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రజా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేరవేస్తుందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగన్‌పై చంద్రబాబు బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు. వీటన్నిటినీ ప్రజలు గమనిస్తున్నారని, గతంలో ఒకసారి బుద్ధి చెప్పారని మరోసారి 2024లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ ఛైర్మన్ నజీమున్నిస, ఇస్మాయిల్, మున్సిపల్ కమిషనర్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ పదవీ కాలం పొడిగింపు

మడకశిర రూరల్ : మండల పరిధిలోని గుర్రపుకొండ గ్రామానికి చెందిన కారుణ్య రాజశేఖర్ అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్నారు. పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగించిన సందర్భం గా సిఎం జగన్, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి కారుణ్య రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. వారు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, రైతులు, ప్రజలకు తమ సేవలు అందజేస్తామని తెలిపారు.

కారుణ్య రాజశేఖర్

నేడు ఇంటిగ్రేటెడ్ కార్యక్రమంపై శిక్షణ

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో బుధవారం(నేడు) ఉదయం 10 గంటలకు ఇంటిగ్రేటెడ్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు భక్తర్‌సాబ్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి పుల్లయ్యచౌదరి, రంగేగౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు నాగరాజు, కన్నా, నాగరాజ్ తెలిపారు. స్థానిక బాలాజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ, మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, గృహసా రథులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

యువగళంలో పాదయాత్రలో 'పల్లె', పార్థ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రకాశం జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో సాగుతున్న యువగళం పాదయాత్రలో మంగళవారం పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారు నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, కొద్దిసేపు ఆయనతో కలిసి నడిచారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సిఎం కావాలని ప్రజలు కోరుకొంటున్నట్లు వారు వెల్లడించారు. వారి వెంట యువనేత సురేష్, నాయకులు, తదితరులు ఉన్నారు.

లోకేష్‌ను కలిసిన పల్లె, పార్థసారథి

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో అనుమతులు లేని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలను వెంటనే మూసి వేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఇఒ గంగప్పకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ నారాయణ, చైతన్య పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోక పోతే విద్యాశాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష కుమార్, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతి ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆటోనగర్ సమస్యలను పరిష్కరిస్తాం

హిందూపురం : పట్టణంలోని ఆటోనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని టిడిపి సమన్వయకర్త శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మంగళవారం టిడిపి నాయకులు, కౌన్సిలర్లతో కలిసి ఆటోనగర్‌లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఆటోనగర్‌ను నిర్లక్ష్యం చేసిందన్నారు. కనీస సదుపాయాను సైతం కల్పించలేదన్నారు. ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తామన్నారు. టిడిపి అధికారం లోకి వచ్చిన వెంటనే ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ఆటోనగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్, కౌన్సిలర్ సతీష్‌కుమార్, మైనార్టీ అధ్యక్షులు హిదాయత్, లింగారెడ్డి, నూర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. డిపో మేనేజర్ వినయతుల్లా ఆధ్వర్యంలో మంగళవారం వారికి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు కె.శ్రీనివాసులు, సిసి రాయుడు, టి.నాగార్జున, శ్రీరాము లు డీజిల్ ఆదా చేసిన డ్రైవర్ బిఎస్ వాసులు, గంగాద్రి, జేజే నాయక్ గ్యారేజ్‌లో ప్రతిభ కనబరిచిన తిరుపాల్ నాయక్, తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్ పెద్దన్న, ఎస్‌బి నాయక్, శోభారాణి, నాగేశ్వరరావు, అన్ని అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-రొళ్ల

మండల వ్యాప్తంగా ఉన్న పారిశుధ్య కార్మికులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం వారు మాట్లాడుతూ 9 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఉన్నతాధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నరు. ప్రతి నెలా అడుగుతున్నా చూద్దాం, చేద్దాం అంటున్నారే తప్ప జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై యుఆర్‌డి కృష్ణప్పను వివరణ కోరగా మండల వ్యాప్తంగా 51 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా 9 తొమ్మిది నెలలు నుంచి జీతం పడని మాట వాస్తవమేనని, పంచాయతీ ఖాతాలో నిధులు లేకపోవడం వల్లే పెండింగ్‌లో ఉందని వివరణ ఇచ్చారు.

ఎండియు వాహనాల్లో పుస్తకాల తరలింపు

కొత్తచెరువు : స్థానిక ఎంఇఒ కార్యాలయం నుంచి పుస్తకాలను మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు బియ్యం పంపిణీ చేసే(ఎండియు) మొబైల్ వాహనాల్లో తరలించడం చర్చనీయాంశంగా మారింది. పుస్తకాలను ఎంఇఒ కార్యాలయం వారే వివిధ పాఠశాలలకు ప్రయివేటు వాహనాల్లో తరలించాల్సి ఉంది. అయితే మంగళవా రం ఎండియు వాహనాల్లో పుస్తకాలను తరలించడంపై ప్రజలు బహిరంగంగా చర్చించుకున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహశీల్దార్ స్వాతిని వివరణ కోరగా ఈ వాహనాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

గ్రంథాలయం తనిఖీ

మడకశిర రూరల్ : పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సెక్రటరీ పి.రమ సందర్శించి రికార్డులు, పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వివిధ పుస్తకాలను ఆన్ డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేసి జిల్లా గ్రంథాలయానికి పంపించాలని ఆదేశించారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన 'బత్తల'

ప్రజాశక్తి-కదిరి టౌన్

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని మంత్రి కార్యాలయంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణ, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ మర్యాద పూర్వ కంగా కలిశారు. అలాగే చిత్తూరు ఎంపి రెడ్డప్ప, కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌లను మర్యాద పూర్వ కంగా కలిశారు. వారి వెంట దశరథరామయ్య నాయుడు, పురుషోత్తంరెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

హెచ్‌బి టెస్టింగులపై శిక్షణ

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో హెచ్‌బి టెస్టింగ్‌లపై సిహెచ్‌ఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం పుట్టపర్తి డివిజన్ సిహెచ్‌ఓలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి హాజరై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇంజినీర్ మహమ్మద్ సోహైల్, డాక్టర్ నాగరాజు, పుట్టపర్తి సిహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల పరిశీలన

పరిగి-ప్రజాశక్తి

మండల పరిధిలోని జయమంగళ నదిలో రెండు నెలల నుంచి జెపి కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం ఇసుక తవ్వ కాలు చేపడుతోంది. ఈ తవ్వకాలు ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేసినా ఫలితం లేకపోయింది. దీంతో పరిగి గ్రామానికి చెందిన బద్రీనాథ్ ఇటీవల హైకోర్టును ఆశ్రయించగా వెంటనే ఇసుక అక్రమ రవాణాను ఆపాలని లేని చో అధికారులు పూర్తి బాధ్యత వహించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో సెబ్ అధికారులు మంగళవారం జయ మంగళ నదికి చేరుకుని ఇసుక అక్రమ తవ్వకాలపై ఆరా తీశారు. అలాగే స్థానికులతో ఫిర్యాదులు స్వీకరించారు.

ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న సెబ్ అధికారులు

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోండి

స్పెషల్ ఆఫీసర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ఉచిత సర్వీసులను అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 'జగనన్నకు చెబుదాం', 'జగనన్న సురక్ష' కార్యక్రమాల జిల్లా స్పెషల్ ఆఫీసర్(ఎపి జెన్కో మేనేజింగ్ డైరెక్టర్) కెవిఎన్ చక్రధర్‌బాబు సూచించారు. మండల పరిధిలోని బూదిలి గ్రామంలో మంగళవారం ఎంపీడీవో రఘునాథ్‌గుప్తా, తహశీల్దార్ రంగనాయకులు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆయన అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకా ల అమలు, 11 రకాల సర్వీసులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు సంక్షేమ పథకాలు పొందాలంటే సర్టిఫికెట్లు ఉపయోగప డతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంద న్నారు. అలాగే జగనన్న సురక్ష పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెసి టిఎస్ చేతన్, పుట్టపర్తి ఆర్డిఒ భాగ్యరేఖ, జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి, డిఎల్ డివో శివారెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచి ఆంజనేయులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని కురుమామిడి సచివాలయ పరిధిలోని రెక్కమాను గ్రామంలో మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించినట్లు వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి సర్వే చేసి 975 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాషా, ఎంపిడిఒ యాదవేంద్ర, పంచాయతీ కార్యదర్శులు రవి, ఓబులమ్మ, మాజీ జడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, సర్పంచి సుధాకర్, జెసిఎస్ రవీంద్రారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : 'జగనన్న సురక్ష'లో భాగంగా మండల పరిధిలోని కోడిపల్లి పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అతిథులు సూచించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మంజునాథ్, తహశీల్దార్ బాబు, ఎంపిడిఒ నరసింహనాయుడు, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని పుట్టపర్తి స్పెషల్ ఆఫీసర్ సుబ్బాదాసు పేర్కొన్నారు. ఆయన మంగళవారం జగరాజుపల్లి గ్రామ సచివాలయంలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవి రమణారెడ్డి, తహశీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో అశోక్‌కుమార్‌రెడ్డి, ఎఒ వెంకటబ్రహ్మం, జగరాజుపల్లి, కప్పలబండ సర్పంచులు, వైసిపి మండల కన్వనర్ నర్సారెడ్డి, గంగాద్రి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లబ్ధిదారులకు 800 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు మలిరెడ్డి రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బూదిలిలో లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న స్పెషల్ ఆఫీసర్ కెవిఎన్ చక్రధర్‌బాబు

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలో సమస్యలు తిష్ట వేశాయని, వాటిని పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఉప సర్పంచి యుగంధర్, వార్డు మెంబర్లు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచి రాధా అధ్యక్షతన పంచాయతీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, వీధి దీపాలు వెలగడం లేదన్నారు. పంచాయతీకి కోట్లాది రూపాయల ఆదాయం ఉన్నా అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. ఎస్సీ కాలనీలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, వాటి నిర్మూలణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్థానిక బుక్కపట్నం రోడ్డులోనే బ్రిడ్జి వద్ద కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, వార్డు మెంబర్లు రమేష్‌బాబు, కేశవ, కవిత, మునిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కేంద్ర బృందం అధికారి కళై అరసన్ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అలాగే ప్రజలకు ఏవిధంగా సేవలు అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని సమస్యలపై సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ హేమంత్‌కుమార్, సిబ్బంది, సచివాలయం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

'మిషన్ రాయలసీమ' కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

'మిషన్ రాయలసీమ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం బి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ టిఎన్టియుసి అధ్యక్షులు నిజాం, తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి మీసేవ సుధాకర్, మైనార్టీ కార్యదర్శి పొగాకు షబ్బీర్‌బాషా, సౌదీ నాగరాజు, అంజనప్ప, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు పిలుపునిస్తే.. పోలీసు నోటీసులా?

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ విజయవాడలోని ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మంగళవారం పోలీసులు నాయకులకు ముందోస్తు నోటీసులు ఇచ్చారు. నోటీసు అందుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ సిఎం జగన్ విద్య, వైద్య రంగాల్లో సంపూర్ణ మార్పులు తీసుకొస్తామని చెబుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవాడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా విద్యార్థులను కలుపుకొని నేడు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆర్‌డిటి సహకారంతో స్పెయిన్ కోచ్‌లు పట్టణంలోని కాలేజీ మైదానంలో ఉన్న బాస్కెట్ బాల్ కోర్టులో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఇస్తారని ధర్మాంభ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం వారు మాట్లాడుతూ శిక్షణ శిబిరం ఈ నెల 30వ తేదీ వరకూ కొనసాగుతుందని, బాస్కెట్‌బాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పెయిన్ బృందం సభ్యులు బాస్కెట్ బాల్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్ అందజేశారు. కార్యక్రమంలో ధర్మాంభ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రొళ్ల

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ప్రముఖులు సూచించారు. మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆర్డిటి ఆధ్వర్యంలో నిర్వహించిన అట్లాంటిక్స్ క్రీడా పోటీలను జిల్లా కోఆర్డినేటర్లు వంశీ, ఓబులేషు, ఎటిఎల్ బాబురావు నిర్వహించారు. ఇందులో రొళ్ల, అలుపనపల్లి కెజిబివి, రత్నగిరి, మదూడి, ఇనగలూరు, కాకి, అగలి జడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాల, మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందెంతో షాట్‌పుట్, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహించి విజేతకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటమిని సమానంగా చుడాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు మంజమ్మ, నారాయణస్వామి, ప్రతిభ, మోహన్, వెంకట్, అజీజుల్లా, ఆర్‌డిటి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

రొళ్ల : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డిటి స్పోర్ట్స్ అధికారి వాసవీకృష్ణ, ఓబులేసు, ఎటిఎల్ సుబ్బారావు హాజరయ్యారు. పోటీల్లో రొళ్ల, అగలి మండలాల్లోని జడ్పి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. వారికి రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ క్రీడా పోటీలు విద్యార్థుల్లో ఉల్లాసం నింపుతాయని, విద్యార్థులు గెలు పు ఓటమిలను సమానంగా చూడాలని సూచించారు. కార్యక్ర మంలో రెండు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై 'గురుకులం' ప్రిన్సిపల్ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో మరుగుదొడ్లు సరిగా లేవని దుర్వాసన వస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలియజేయడంతో సమాచారం సేకరించేందుకు వెళ్లిన స్థానిక పాత్రికేయులపై ప్రిన్సిపల్‌తో పాటు సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. పాత్రికేయులు పాఠశాల వద్దకు వెళ్లగా ప్రిన్సిపల్ అనుమతి లేనిదే లోపలికి పంపించమని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇంతలో బయటి నుంచే పాఠశాల ఆవరణలో మూత్ర విసర్జన చేస్తున్న విద్యార్థుల ఫొటోలను తీయగా విషయం తెలుసుకొన్న ప్రిన్సిపల్ సాయంత్రం 4 గంటలకు వచ్చి పాత్రికేయులపై మండిపడుతూ కేసులు పెడతానని బెదిరించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మంగళవారం 2002-03లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ. 25 వేల విలువ చేసే సౌండ్ సిస్టంను అందజేసినట్లు హెచ్‌ఎం మధురాంబ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, జయరాములు, చిన్నప్పయ్య, గంగాధర్, విశ్వనాథ్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు ఇలియాజ్, షౌకత్‌అలీ, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు